సాక్షి
మెదక్
మంగళవారం । 28 । ఫిబ్రవరి । 2023



వివాహ విందుకు వచ్చి..
వివాహ విందుకు బయలుదేరారు. కొద్ది నిమిషాలయితే గమ్యస్థానానికి చేరేవారు. ఇంతలోనే ఇద్దరు యువకులను రోడ్డు ప్రమాదం బలి తీసుకుంది.
8లో



ఆలయంలో చోరీ
చిలప్‌చెడ్ మండల పరిధిలోని చండూరు శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో దొంగతనం జరిగింది. పోలీసులు క్లూస్ టీంను పిలిపించి వివరాలు సేకరించారు.
8లో



ఇదేం హాస్టల్.
అల్లాదుర్గం బీసీ బాలికల హాస్టల్‌లో ఆరుగురు విద్యార్థినులే ఉన్నారు. వార్డెన్ పట్టించుకోక పోవడంతో వారే స్వయంగా వంట చేసుకుంటున్నారు.
9లో

సమస్య మీది.. పరిష్కారం మాది

రేపు నర్సాపూర్ మున్సిపల్ సమస్యలపై 'సాక్షి' ఫోన్ ఇన్

మీ ఇంటిచుట్టూ కుక్కలు, కోతులు సంచరిస్తున్నాయా? తాగునీరు, వీధిలైట్లు, పారిశుధ్యం లోపాలున్నాయా? అయితే మీ సమస్యను అధికారుల దృష్టికి తీసుకురండి.. పరిష్కారానికి మా వంతు కృషి చేస్తాం.



తేదీ : 01.03.2023
సమయం:
ఉదయం 10 నుంచి 11 గంటల వరకు
అధికారి: వెంకట్‌గోపాల్,
నర్సాపూర్ మున్సిపల్ కమిషనర్

ఫోన్ చేయాల్సిన నంబర్:
99634 30404

న్యూస్‌రీల్

అందరి చూపు బీజేపీ వైపు



పార్టీలో చేరిన వారితో మురళీయాదవ్

నర్సాపూర్: ఆయా రాజకీయ పార్టీల నాయకులు కార్యకర్తలు బీజేపీ వైపు చూస్తున్నారని మున్సిపల్ చైర్మన్, బీజేపీ నాయకుడు మురళీయాదవ్ అన్నారు. సోమవారం హత్నూర మండలంలోని నవాపేటకు చెందిన వార్డు సభ్యుడు పాండుతో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు బీజేపీలో చేరగా వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమం బీజేపీతోనే సాధ్యమని ప్రజలు నమ్ముతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఓబీసీ జిల్లా మోర్చా అధ్యక్షుడు రమేశ్‌గౌడ్, కౌన్సిలర్లు రాజేందర్, బుచ్చేశ్‌యాదవ్, సతీశ్‌యాదవ్, నాగప్రభుగౌడ్, రవి, చంద్రయ్య, నగేశ్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న నిర్మల

చిన్నశంకరంపేట(మెదక్): బాలికలకు చట్టం అనేక రకాలుగా రక్షణ కల్పిస్తుందని జిల్లా భరోసా కేంద్రం లీగల్ అడ్వైజర్ నిర్మల తెలిపారు. సోమవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు బాలిక సంరక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలను అడ్డుకునేందుకు ప్రభుత్వం చట్టం తీసుకువచ్చిందన్నారు. అలాగే బాలకార్మిక చట్టం, పోక్సో ద్వారా ఆడబిడ్డల రక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టిందని వివరించారు. కార్యక్రమంలో భరోసా కేంద్రం అధికారి రేణుక, ప్రిన్సిపాల్ నాగేందర్ పాల్గొన్నారు.

డాక్టర్ ప్రీతి మృతికి నివాళి



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం


మెదక్ మున్సిపాలిటీ: డాక్టర్ ప్రీతి ఆత్మకు శాంతి చేకూరాలని సోమవారం రాత్రి మెదక్‌లో ఉపాధ్యాయ, ఉద్యోగ, విద్యార్థి సంఘాల నాయకులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. గుల్షన్ క్లబ్ నుంచి రాందాస్ చౌరస్తా వరకు ర్యాలీ కొనసాగింది. కార్యక్రమంలో టీపీటీఎఫ్ నాయకులు సంగయ్య, వెంకట్రాంరెడ్డి, రాజగోపాల్‌గౌడ్, ఈశ్వర్, ప్రతాప్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తిపోతలేనా..?



- సాగునీటి లక్ష్యాలను నెరవేర్చని పథకాలు
- మంజీరాలో నీరున్నా అందని వైనం

వెలవెలబోతున్న ఎనగండ్ల మామిడి చెరువు



నిరుపయోగంగా రంగంపేట ఎత్తిపోతల పథకం

కొల్చారం(నర్సాపూర్): గ్రామీణ ప్రాంతాల్లో బీడు భూములను సస్యశ్యామలం చేసేందుకు కోట్లాది రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన ఎత్తిపోతల పథకాలు నిర్వహణ లోపంతో నిరుపయోగంగా మారుతున్నాయి. పుష్కలంగా నీరు ఉన్నా మోటార్లు మరమ్మతులకు గురికావడంతో పంటలకు నీరు అందని దుస్థితి నెలకొంది. కొల్చారం మండలంలో మంజీరానది 14 కిలోమీటర్ల మేర ప్రవహిస్తోంది. ఎనగండ్ల నుంచి మొదలై చిన్నఘనపూర్ వనదుర్గా ప్రాజెక్టు వరకు పారుతోంది. నీటిని ఒడిసిపట్టి పంట పొలాలకు అందించాలనే లక్ష్యంతో ఎనగండ్ల, రంగంపేట, సంగాయిపేట ఎత్తిపోతల పథకాలను నిర్మించారు. 2012లో ఇవి అందుబాటులోకి రాగా.. పదిన్నర ఏళ్ల పాటు సాఫీగా నడిచాయి. మోటార్లు చెడిపోవడంతో పాటు విద్యుత్ సమస్యతో ప్రస్తుతం సాగుకు నీరందించని పరిస్థితి.

- మండలంలో 30 ఏళ్ల క్రితమే చిన్నఘనపూర్ సమీపంలోని మంజీరా నదిపై రెండు ఎత్తిపోతల పథకాలను నిర్మించారు.
- ఇదే డిమాండ్‌తో డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి ప్రజాప్రస్థానం పాదయాత్ర సందర్భంగా ఎనగండ్ల, రంగంపేట, సంగాయిపేట రైతులు సాగునీటి కష్టాలను వివరించారు.
- అధికారంలోకి వస్తే సమస్యను పరిష్కరిస్తానని రైతులకు ఆయన హామీ ఇచ్చారు. అనంతరం పల్లెబాట సందర్భంగా ఎత్తిపోతల పథకాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.
- ఎనగండ్లలో 170 ఎకరాల ఆయకట్టుకు నీరు అందించే లక్ష్యంతో రామసముద్రం చెరువులోకి, రంగంపేట శివారులో 315 ఎకరాల ఆయకట్టుకు నీరు అందించేందుకు కొత్తచెరువులోకి, సంగాయిపేట శివారులో 220 ఎకరాల ఆయకట్టు కోసం పెద్ద చెరువులోకి పైపులైన్ కలుపుతూ ఎత్తిపోతల పథకాలను నిర్మించారు.
- ఇందుకోసం రూ.9.5 కోట్లు వెచ్చించారు. 2012లో ఇవి అందుబాటులోకి వచ్చాయి.
- మూడేళ్ల ప్రభుత్వం ద్వారా నిర్వహిస్తూ వచ్చిన ఎత్తిపోతల పథకాలు ఆ తర్వాత నిర్వహణ ఆయకట్టు రైతుల చేతుల్లోకి వచ్చాయి.
- అవసరమైన నిధుల సమీకరణ రైతులే చూస్తూ నెట్టుకొచ్చారు. మూడేళ్లుగా ఎత్తిపోతల పథకాల నిర్వహణ రైతులకు భారంగా మారింది.
- నది నుంచి నీరును తోడే మోటార్లు తరచు కాలిపోవడం, మరమ్మతులు చేపట్టేందుకు పెద్ద మొత్తంలో డబ్బులు అవసరం కావడం, విద్యుత్ సరఫరాకు సంబంధించి కేబుల్ కాలిపోవడంతో నిర్వహణ భారంగా మారింది.
- సామర్థ్యానికి మించిన మోటార్లు లేకపోవడం.. మరమ్మతులకు ప్రభుత్వం నుంచి సహకారం అందకపోవడంతో చేసేదేమి లేక లక్షలు వెచ్చించి బోర్లు వేసుకుంటున్నారు.

పట్టించుకునే వారే లేరు



మోటార్లు కాలిపోయి ఏడాది అవుతోంది. డబ్బులు వేసి మరమ్మతులు చేయిద్దామంటే అందరు రైతులు ముందుకు రావడం లేదు. ప్రభుత్వమే సహకారం అందించి, కొత్త మోటార్లు ఏర్పాటుచేసి ఎత్తిపోతలు నడిచేలా చూడాలి.
– కృష్ణ, రైతు, రంగంపేట

కష్టకాలంలో ఇబ్బందులు



ఎత్తిపోతలతో రామసముద్రంతో పాటు మామిడిచెరువు ద్వారా సుమారు 400 ఎకరాల ఆయకట్టుకు నీరందించే అవకాశం ఏర్పడింది. ప్రస్తుతం ఉన్న మోటార్లు నీటిని ఎత్తిపోసే సామర్థ్యం తక్కువగా ఉన్నాయి. సహకారం అందించేందుకు కొందరు రైతులు మాత్రమే ముందుకొస్తున్నారు. దీంతో నిర్వహణ భారంగా మారింది.
– మల్లారెడ్డి, రైతు, ఎనగండ్ల

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి

జెడ్పీ చైర్‌పర్సన్ హేమలత శేఖర్‌గౌడ్



కంటి వెలుగు శిబిరంలో జెడ్పీ చైర్‌పర్సన్ హేమలతా శేఖర్‌గౌడ్, తదితరులు

మనోహరాబాద్(తూప్రాన్): కంటి వెలుగును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీ చైర్‌పర్సన్ ర్యాకల హేమలతా శేఖర్‌గౌడ్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని పోతారంలో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కంటి వెలుగుపై ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీలు పురం నవనీత రవి, కల్లూరి హరికృష్ణ, వైస్ ఎంపీపీ విఠల్‌రెడ్డి, ఎంపీడీఓ యాదగిరిరెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు బీఆర్‌ఎస్ నాయకులు వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన బాలల పరిరక్షణ కమిటీ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బాలల పరిరక్షణకు అందరు పాటుపడాలని పేర్కొన్నారు. బాల కార్మికులు, బాల్య వివాహాలు, వేధింపులు, అక్రమ రవాణా, భిక్షాటన తదితర అంశాల్లో వారికి అండగా ఉండాలని తీర్మానం చేశారు. అనంతరం ఎంపీపీ అధ్యక్షుడిగా, ఎంపీడీఓ, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు కన్వీనర్లుగా కమిటీని ఎన్నుకున్నారు.

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు 34 మంది గైర్హాజరు

మెదక్ కలెక్టరేట్: జిల్లాలో ఇంటర్ ప్రయోగ పరీక్షలు కొనసాగుతున్నాయి. సోమవారం జరిగిన ప్రయోగ పరీక్షలకు 34 మంది గైర్హాజరైనట్లు జిల్లా నోడల్ అధికారి సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 700 మందికి 666 మంది హాజరైనట్లు చెప్పారు. విద్యార్థులు ఆందోళనకు గురికాకుండా పరీక్షలు రాయాలని సూచించారు.

సామాజిక సేవలో పోటీ పడాలి

మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హనుమంతరావు

చిన్నశంకరంపేట(మెదక్): తనకు సహకరిస్తున్న ప్రజాప్రతినిధులను ఇబ్బందులకు గురిచేసే బదులు సామాజిక సేవలో నాతో పోటీ పడాలని మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని సోమేశ్వరాలయంలో తన కుమారుడు రోహిత్‌తో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మండలంలోని 550 మందికి రూ. 25 వేల చొప్పున ఆర్థిక సాయం అందించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మెదక్ తన పుట్టిన గడ్డ అని.. రాజకీయ భిక్ష పెట్టిన సొంత నియోజకవర్గంలో సేవ చేసేందుకు తన కుమారుడు ముందుకు వచ్చాడని చెప్పారు. మైనంపల్లి సోషల్ సర్వీస్ ద్వారా అనాథ బాల బాలికలను ఆదుకుంటామన్నారు. రోహిత్ మాట్లాడుతూ.. మండలానికి ఒక పాఠశాలను దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు రాజిరెడ్డి, గోపాల్, పోచయ్య, యాదవరావు, మల్లేశం, మాజీ సర్పంచ్‌లు, వివిధ పార్టీల నాయకులు శ్రీమాన్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, సురేందర్‌గౌడ్, మల్లేశంగౌడ్ పాల్గొన్నారు.

అర్హులకు పోడు పట్టాలు ఇవ్వాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

మెదక్ కలెక్టరేట్: అర్హులైన రైతులకు పోడు భూముల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. నర్సాపూర్, కౌడిపల్లి మండలాల్లోని పలు గ్రామాలకు చెందిన రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అనంతరం కలెక్టర్ రాజర్షిషాకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్ ఖాలేక్ మాట్లాడుతూ.. నాలుగు తరాల నుంచి అటవీ భూములను సేద్యం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న నిరుపేద రైతులకు పోడు పట్టాలిచ్చి న్యాయం చేయాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళనను మరింత తీవ్రం చేస్తామని హెచ్చరించారు.

నర్సంపల్లి రైతుల సమస్యను పరిష్కరించండి

దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు

మెదక్ కలెక్టరేట్: ధరణితో రైతుల కష్టాలు తీరుతాయనుకుంటే కొత్త కష్టాలు వచ్చి ఇబ్బంది పడుతున్నారని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. సోమవారం నర్సంపల్లి గ్రామ రైతులతో కలిసి కలెక్టర్ రాజర్షిషాకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించకపోవడం సరికాదన్నారు. నార్సింగి మండలం నర్సంపల్లిలోని 410 ఎకరాల భూమిని రైతులు 50 ఏళ్లుగా సాగు చేసుకుంటున్నారని తెలిపారు. కానీ కొంతమంది అవినీతి అధికారుల తప్పిదంతో 50 ఏళ్లుగా కాస్తులో రైతుల భూములను ఇనాం భూములు మార్చి రాశారన్నారు. ఈవిషయమై ఇప్పటికీ 20 సార్లు ఫిర్యాదు చేసినా పరిష్కరించలేదన్నారు. ఇప్పటికైనా రైతుల సమస్య పరిష్కరించకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

భూసేకరణకు రంగం సిద్ధం!



రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ శ్యాంప్రకాశ్

తూప్రాన్: మున్సిపల్ పరిధిలోని అల్లాపూర్ గ్రామశివారు టోల్‌ప్లాజా సమీపంలోని రైతులతో ఆర్డీఓ శ్యాంప్రకాశ్ సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గ్రామంలో సర్వే నంబర్ 232, 318, 319 ఎకరాల్లో సుమారు 1,600 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. కాగా 232 సర్వే నంబర్ పట్టణ సమీపంలోని 44వ జాతీయ రహదారిపై ఉన్న టోల్‌ప్లాజా వెనకాల సర్వే నంబర్ 232లో సుమారు 400 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమి విలువ ప్రస్తుతం రూ. కోట్లలో ఉంది. హైవేకు సమీపంలో ఉండడంతో ప్రభుత్వం రైతుల నుంచి భూమిని సేకరించేందుకు రంగం సిద్ధం చేసింది. ఈక్రమంలో భూ సర్వే సైతం చేపట్టారు. సర్వే నంబర్ 232లో ఉన్న రైతులతో ఆర్డీఓ శ్యాంప్రకాశ్ తహసీల్దార్ జ్ఞానజ్యోతితో కలిసి మాట్లాడారు. ఈస్థలంలో పరిశ్రమలు నెలకొల్పి స్థానికులకు ఉపాధి కల్పిస్తామని వివరించారు. అలాగే ఎకరాకు 400 గజాల స్థలాన్ని రైతులకు లేఅవుట్ చేసి పట్టాలు ఇస్తామని పేర్కొన్నారు. అయితే రైతులు మాత్రం ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకొని జీవిస్తున్న తాము భూములు ఇవ్వబోమని తెలిపారు. అయితే అధికారులు మాత్రం రైతులకు నచ్చజెప్పి ఎలాగైనా భూములను ల్యాండ్ పూలింగ్ పేరుతో సేకరించేందుకు రంగం సిద్ధం చేసినట్లు సమాచారం. సమావేశంలో అల్లాపూర్ కౌన్సిలర్ భగవాన్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

కష్టపడి పనిచేస్తే మంచి ఫలితాలు

డీఈఓ డాక్టర్ రాధాకిషన్



డీఈఓకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్టీయూటీఎస్ నాయకులు

మెదక్ కలెక్టరేట్/ చేగుంట(తూప్రాన్): ఉపాధ్యాయుల కష్టపడి పనిచేస్తే మంచి ఫలితాలు వస్తాయని డీఈఓ డాక్టర్ రాధాకిషన్ అన్నారు. సోమవారం ఎస్టీయూటీఎస్ నాయకులు డీ ఈఓను కలిసి సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయు లు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రణీద్‌కుమార్ ప్రధాన కార్యదర్శి రాజగోపాల్‌గౌడ్, బాధ్యులు భూపతి గౌడ్, శివప్రసాద్, రాజు, కిష్టయ్య, వేణుగోపాల్, దేవదాస్, బాల మల్లేశం, సతీష్, సిద్ధిరాములు, విఠల్, తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు చేగుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించారు. విద్యార్థులు క్రమం తప్పకుండా బడికి రావాలన్నారు. ప్రతిరోజు బడికి హాజరైతే పాఠాలను సులభంగా అర్థం చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు మాధవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సత్వర పరిష్కారం చూపండి

- అదనపు కలెక్టర్ రమేశ్
- ప్రజావాణికి వినతుల వెల్లువ



విన‌తులు స్వీకరిస్తున్న, అదనపు కలెక్టర్లు రమేశ్, ప్రతిమాసింగ్

మెదక్ కలెక్టరేట్: ప్రజావాణిలో వచ్చిన అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలని అదనపు కలెక్టర్ రమేశ్ అధికారులకు సూచించారు. సోమవారం అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌లో కలిసి వినతులు స్వీకరించారు. మొత్తం 105 అర్జీలు రాగా ఆసరా పింఛన్లు, డబుల్ బెడ్రూం ఇళ్లకు సంబంధించి 15, భూ సమస్యలకు సంబంధించి 62, మిగితా 28 వినతులు వివిధ శాఖలకు సంబంధించినవి ఉన్నాయి. జాప్యానికి తావివ్వకుండా అర్జీలను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ రమేశ్ ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు విజయ శేఖర్‌రెడ్డి, కమలాకర్, రజాక్, రాధాకిషన్, నాగరాజ్, విజయలక్ష్మి, ఆశాకుమార్, కలెక్టర్ ఏఓ, పాల్గొన్నారు. ఖదీర్‌ఖాన్ కుటుంబానికి న్యాయం చేయాలని బీఎస్పీ నాయకులు ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు.

కల్లు దుకాణాన్ని తొలగించండి



మెదక్ మండలం తిమ్మక్కపల్లి గ్రామ శివారులోని మల్లన్న, ఎల్లమ్మ ఆలయాల సమీపంలోని కల్లు దుకాణంలో కల్లుతో పాటు మద్యం సేవించి ఆలయానికి వచ్చే మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారు. వెంటనే కల్లు దుకాణాన్ని తొలగించేలా చర్యలు తీసుకోవాలి.
– కొండ్రపల్లి వేణుగోపాల్, తిమ్మక్కపల్లి

పాఠశాలలో మరుగుదొడ్లు నిర్మించాలి



హవేళిఘణపూర్ మండలం శమ్నాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో బాత్రూంలు, కిచెన్ షెడ్డు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. వాటి నిర్మాణం చేపట్టి విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి.
– మలొట్టి రవి, ఎస్‌ఎంసీ చైర్మన్

రికార్డులో రావడం లేదు



తూప్రాన్ మండలం వెంకటాయపల్లి గ్రామ శివారులో వ్యవసాయ భూమిని గ్రామానికే చెందిన పుట్ట నర్సయ్య వద్ద కొనుగోలు చేశాం. కాని పహణీలో భూమి ఉన్నట్టు చూపిస్తున్నా.. ఆన్‌లైన్‌లో రావడం లేదు. అధికారుల చుట్టూ తిరిగి విసిగిపోయాం.
– చామని బాలయ్య, వెంకటాయపల్లి, తూప్రాన్

ఆన్‌లైన్‌లో చూపడం లేదు



మెదక్ పట్టణ శివారులోని 873/12/1 సర్వే నెంబర్‌లో ఎకరా పొలం మా నాన్న నుంచి వారసత్వంగా వచ్చింది. ప్రభుత్వం పట్టా ఇచ్చినప్పటికీ ఆన్‌లైన్‌లో మాత్రం చూపడం లేదు. ఈ విషయమై తహసీల్దార్, ఆర్డీఓకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదు.
– సొన్నాయిల గణేశ్, మెదక్

కాస్తులో ఉన్నా.. పట్టా లేదు



తూప్రాన్ మండలం నర్సంపల్లి గ్రామ శివారులోని 242 సర్వే నెంబర్‌లో గల పరంపోగు భూమిలో కాస్తులో ఉన్నాం. కానీ పట్టాలు ఇవ్వడం లేదు. ఏళ్ల తరబడి తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.
– జాప దుర్గయ్య, నర్సంపల్లి

కొత్త పట్టా పాస్‌బుక్ ఇప్పించండి



చేగుంట మండలం చందాయిపేట శివారులో 36 గుంటల భూమిని 2020లో నా భార్యపేర కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నాం. గతంలో పట్టాదార్ పాస్‌బుక్‌ను ప్రభుత్వం అందజేసింది. కానీ ఇప్పుడు రావడం లేదు. దయచేసి పట్టా పుస్తకం ఇప్పించగలరు.
– శోభన్, చందాయిపేట

క్లుప్తంగా

మూసివేసిన పరిశ్రమలో మంటలు



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

మనోహరాబాద్‌(తూప్రాన్‌): మూసివేసిన ఓ పరిశ్రమలో మంటలు చెలరేగాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ముప్పిరెడ్డిపల్లి శివారులోని బీఎస్‌ స్టీల్‌ పరిశ్రమ ఆవరణలో సోమవారం మంటలు చెలరేగాయి. దీంతో స్థానికులు ఫైర్‌ ఇంజిన్‌ వారికి ఫోన్‌ చేశారు. నర్సాపూర్‌ నుంచి వచ్చిన అగ్నిమాపక సిబ్బంది రెండుగంటల పాటు శ్రమించి మంటలను ఆర్పేసింది.

జేసీబీ దహనం



కల్హేర్‌(నారాయణఖేడ్‌): గుర్తు తెలియని వ్యక్తులు జేసీబీని దహనం చేశారు. ఈ ఘటన సిర్గాపూర్‌ మండల పరిధిలోని గరిడెగాంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గుండప్ప ఉపాధి నిమిత్తం జేసీబీ తీసుకొచ్చి స్థానికంగా పనిచేయిస్తున్నాడు. ఆదివారం రాత్రి గ్రామ పంచాయతీ వద్ద ఉంచాడు. గుర్తు తెలియని వారు నిప్పు పెట్టడంతో జేసీబీ పూర్తిగా కాలిపోయింది. దీనిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ నారాయణ తెలిపారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్‌: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట న్యాయమూర్తి సోమవారం జరిమానా విధించారు. సిద్దిపేట పట్టణంలోని నర్సాపూర్‌ చౌరస్తా, ఎంపీడీఓ కార్యాలయ చౌరస్తా, రాజీవ్‌ రహదారిపై మూడు రోజుల క్రితం సిద్దిపేట ట్రాఫిక్‌ సీఐ రామకృష్ణ తమ సిబ్బందితో నిర్వహించిన తనిఖీల్లో వాహనదారులను బ్రీత్‌ ఎనలైజర్‌తో పరీక్షించగా, 13 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని సిద్దిపేట కోర్టులో హాజరుపర్చగా విచారణ చేసిన న్యాయమూర్తి రమేష్‌బాబు వారికి రూ.28,500 జరిమానా విధించారు.

ఏడుపాయలలో గుర్తు తెలియని మహిళ మృతదేహం

పాపన్నపేట(మెదక్‌): ఏడుపాయల్లో గుర్తు తెలియని మహిళ మృతదేహం సోమవారం వెలుగు చూసిందని పాపన్నపేట ఎస్‌ఐ విజయ్‌ తెలిపారు. ఏడుపాయలలోని మంజీర పాయ తీరాన 50 నుంచి 55 ఏళ్ల వయసు ఉన్న మహిళ మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో ఉందన్నారు. ఆరెంజ్‌ రంగు చీర, ముదురు నీలంరంగు జాకెట్‌ ధరించి ఉందన్నారు. శరీరంపై ఎలాంటి గాయాలు లేవని, జాతరకు వచ్చి అనారోగ్యంతో మృతి చెంది ఉండవచ్చన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని, ఆనవాళ్లు తెలిసినవారు 9440627014 నంబరులో సంప్రదించాలన్నారు.

వ్యక్తి అదృశ్యం

ఏడు నెలల క్రితమే ప్రేమ వివాహం

పటాన్‌చెరు టౌన్‌: బయటకు వెళ్లి వస్తానని చెప్పిన వ్యక్తి కనిపించకుండాపోయాడు. అమీన్‌పూర్‌ ఎస్‌ఐ సోమేశ్వరి కథనం ప్రకారం...మెదక్‌ జిల్లా నర్సపూర్‌ మండలం హమీద్‌నగర్‌కు చెందిన ప్రణయ్‌కుమార్‌రెడ్డి, సాయిలత ప్రేమవివాహం చేసుకున్నారు. ఏడునెలల క్రితం ఉపాధి నిమిత్తం అమీన్‌పూర్‌ మున్సిపాలిటీలోని భవానీపురం కాలనీకి వచ్చారు. ఈ నెల 22వ తేదీ రాత్రి పదిగంటలకు బయటకు వెళుతున్నా అని చెప్పాడు. రాత్రయినా తిరిగి రాలేదు. భర్త కోసం భార్య సాయిలత తెలిసినవారి వద్ద, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. ఐదురోజులు దాటినా జాడ తెలియకపోవడంతో సోమవారం ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ప్రణయ్ కుమార్‌రెడ్డి(ఫైల్‌)

వివాహ విందుకు వచ్చి..

బైక్‌ అదుపు తప్పి ఇద్దరు యువకుల దుర్మరణం

- హవేళిఘణాపూర్‌ మండలం చౌట్లపల్లి వద్ద ఘటన
- మృతులు కామారెడ్డి జిల్లావాసులు



సంఘటన స్థలంలో యువకుల మృతదేహాలు

మెదక్‌ రూరల్‌: వివాహ విందుకు బయలుదేరారు. కొద్ది నిమిషాలయితే గమ్యస్థానానికి చేరేవారు. ఇంతలోనే మృత్యువు ఎదురువచ్చిందేమో..ఇద్దరు యువకులను రోడ్డు ప్రమాదం రూపంలో బలి తీసుకుంది. కామారెడ్డి జిల్లా లింగంపేట మండలం సజ్జన్‌పల్లికి చెందిన పోచయ్య(24), విజయ్‌(25) ఆదివారం రాత్రి హవేళిఘణాపూర్‌ మండలం చౌట్లపల్లి గ్రామంలో జరిగే ఓ వివాహ విందుకని బయలుదేరారు. చౌట్లపల్లి శివారుకు చేరగానే రాత్రి సమయం కావడంతో చీకట్లో బైక్‌ అదుపుతప్పి చెట్టును ఢీకొట్టి పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే చనిపోయారు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు మృతులను కామారెడ్డి జిల్లావాసులుగా గుర్తించారు. పంచనామా నిర్వహించి, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మెదక్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న మృతుల కుటుంబీకులు ఆస్పత్రి వద్దకు చేరుకొని కన్నీరు మున్నీరయ్యారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇద్దరూ బంధువులే

లింగంపేట(ఎల్లారెడ్డి): సజ్జన్‌పల్లికి చెందిన విజయ్‌, పోచయ్యలు ఒకే కుటుంబానికి చెందినవారు. వరుసకు చిన్నాన్న, పెద్దనాన్న కుమారులు అవుతారు. స్వగ్రామంలో శుక్రవారం బంధువుల ఇంట్లో పెళ్లి జరిగింది. చౌట్లపల్లిలో ఆదివారం రిసెప్షన్‌ ఉంది. బంధువులంతా రిసెప్షన్‌కు డీసీఎంలో బయలుదేరారు. ఈ ఇద్దరు మాత్రం బైక్‌పై వస్తామని చెప్పారు. బంధువులంతా భోజనాలు చేస్తున్న క్రమంలో ఇద్దరికీ ఫోన్‌ చేయగా, ఎవరూ ఫోన్‌ లిఫ్ట్‌ చేయలేదు. వారి నుంచి ఏ సమాధానం అందలేదు. దీంతో బంధువుంతా ఆందోళన చెందగా, ఇంతలోనే పిడుగులాంటి వార్త అందింది. రోడ్డు ప్రమాదంలో ఇద్దరూ చనిపోయారని, బంధువుల హుటాహుటిన సంఘటనాస్థలానికి చేరుకున్నారు.

విజయ్‌ కూలీనాలీ చేస్తూ తల్లిదండ్రులు పోచయ్య–రుక్కవ్వ, నానమ్మ పర్వవ్వను పోషిస్తున్నాడు. రెక్కాడితేగానీ డొక్కాడని కుటుంబం వారిది. కొన్నేళ్లుగా పోచయ్య రెండు కాళ్లు పడిపోయి మంచానికే పరిమితం అయ్యాడు. పర్వవ్వ కూడా కొద్ది రోజుల క్రితం కింద పడింది. దీంతో ఆమెది కూడా నడవలేని పరిస్థితి. ఉన్న ఎకరం భూమి సాగుచేసుకుంటూ కుటుంబానికి అండగా ఉన్నాడు. 26 ఏళ్లకే నిండు నూరేళ్లు నిండాయంటూ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న తీరు అందరినీ కలిచి వేసింది. పోచయ్య–రుక్కవ్వ దంపతులు సంతానం లేకపోవడంతో ఏడాదిలోపు వయసు ఉన్నప్పుడే విజయ్‌కు దత్తత తీసుకున్నారు. అల్లారుముద్దుగా పెంచి పెద్దచేశారు. రెండేళ్ల క్రితమే మహేశ్వరితో వివాహం జరిపించారు. వీరికి ఏడాదిలోపు కూతురు ఉంది.



విజయ్‌ (ఫైల్‌)

సజ్జన్‌పల్లి గ్రామానికి చెందిన సాయిలు– మైసవ్వ దంపతులకు ఇద్దరు కొడుకులు సాయిలు పెద్దవాడు కాగా, పోచయ్య చిన్న కొడుకు. వ్యవసాయం చేస్తూ కూలిపనులకు వెళ్లే వాడు. పెళ్లికి ఎదిగిన కొడుకు తమకు అన్నివిధాలా ఆసరాగా ఉంటాడని ఆ తల్లిదండ్రులు భావించారు.కానీ ఇంతలోనే దూరమయ్యాడు.



పోచయ్య (ఫైల్‌)

దుబ్బాక కౌన్సిలర్‌ ఇంట్లో చోరీ

దుబ్బాకటౌన్‌ మున్సిపాలిటీ పరిధిలోని 19వ వార్డు కౌన్సిలర్‌ స్వప్న రాజిరెడ్డి ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఎస్‌ఐ మహేందర్‌ తెలిపిన వివరాల ప్రకారం... కౌన్సిలర్‌ స్వప్నరాజిరెడ్డి దుబ్బాకలోని గాంధీ విగ్రహం సమీపంలోని ఇంట్లో కొద్ది నెలలుగా కిరాయికి ఉంటోంది. ఈ క్రమంలోనే ఆదివారం ఇంటికి తాళం వేసి బంధువుల ఊరికి వెళ్లింది. అదే అదునుగా భావించి గుర్తుతెలియని దుండగులు ఇంటి గొళ్లెం తొలగించి లోపలకు చొరబడి తులంన్నర బంగారుఆభరణాలు, 8 తులాల వెండి పట్టీలు ఎత్తుకెళ్లారు. సోమవారం ఉదయం ఊరు నుంచి ఇంటికి వచ్చేసరికి తాళం తీసింది. ఆందోళనకు లోనై ఇంట్లోకి వెళ్లి చూడగా బంగారం, వెండి వస్తువులు కనిపించలేదు. దీంతో వెంటనే కౌన్సిలర్‌ స్వప్న భర్త రాజిరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్లూస్‌టీంతో ఆధారాలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.



ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు

అంతరసాగుగా గంజాయి

పోలీసుల దాడి..235 మొక్కలు స్వాధీనం



రాయికోడ్‌(అందోల్‌): అంతరసాగుగా పెంచుతున్న గంజాయి మొక్కలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తహసీల్దార్‌ ప్రభులు, ఎస్‌ఐ ఏడుకొండలు తెలిపిన వివరాల ప్రకారం..మండల పరిధిలోని సింగితం గ్రామానికి చెందిన రాములు గ్రామశివారులో తనకున్న 30 గుంటల భూమిలో కుసుమ సాగు చేశాడు. అందులో అంతరసాగుగా గంజాయి మొక్కలు పెంచుతున్నట్టు సమాచారం రావడంతో దాడి చేసి 235 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నామన్నారు. తహసీల్దార్‌ సమక్షంలో ఆర్‌ఐ ప్రభాకర్‌ పంచనామా నిర్వహించారు. సంఘటనపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు. జహీరాబాద్‌ రూరల్‌ సీఐ వెంకటేశం సంఘటనాస్థలాన్ని, గంజాయి మొక్కలను పరిశీలించారు.



అంజయ్య మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ శివకుమార్‌

చేపల వేటకు వెళ్లి...

నర్సాపూర్‌ రూరల్‌: చేపల వేటకు వెళ్లి ఓ వ్యక్తి శవమై తేలాడు. నర్సాపూర్‌ ఎస్‌ఐ శివకుమార్‌ తెలిపిన వివరాల ప్రకారం.. మండలపరిధిలోని ఇబ్రహీంబాద్‌ గ్రామానికి చెందిన పదంగళ్ల అంజయ్య(45) ఆదివారం సాయంత్రం పెద్దచెరువుకు వేటకు వెళ్లాడు. రాత్రి పదయినా ఇంటికి రాలేదు. ఆందోళనతో కుటుంబసభ్యులు, గ్రామస్తులు చెరువు వద్ద వెతికారు. అయినా ఆచూకీ లభించలేదు. సోమవారం ఉదయం అంజయ్య మృతదేహం చెరువులో తేలి కనిపించింది. అంజయ్య భార్య శేకమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. చేపలవేటకు వెళ్లి ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందినట్టు ఎస్‌ఐ తెలిపారు.

అప్పుల బాధతో...

పటాన్‌చెరు టౌన్‌: అప్పులబాధతో ఒకరు ఆత్మహత్య చేసుకున్నారు. భానూర్‌–బీడీఎల్‌ ఎస్‌ఐ మహేశ్వర్‌ రెడ్డి కథనం ప్రకారం..రామచంద్రాపురం పరిధిలోని ఈదులనాగులపల్లికి చెందిన మల్లేష్‌(38) పెయింటర్‌గా పని చేస్తున్నాడు. దుబారా ఖర్చుల కారణంగా అప్పులు అయ్యాయి. 26వ తేదీన పనిఉందని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. తిరిగిరాకపోవడంతో కుటుంబసభ్యులు అతడి కోసం గాలించారు. గ్రామ శివారులోని తెల్లగుట్ట వద్ద వేపచెట్టుకు వేలాడుతూ మల్లేష్‌ మృతదేహం కనిపించింది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులతో కలిసి సంఘటనస్థలానికి వెళ్లారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి భార్య సింధూజ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాల కిటికీలు ధ్వంసం

నిజాంపేట(మెదక్‌): మండల పరిధిలోని నందగోకుల్‌ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ని తరగతి గదుల కిటీకీలు, తలుపులు ధ్వంసం చేశారని హెచ్‌ఎం దీప చెప్పారు. మద్యం సేవి ంచాక ఈ ఘటనకు పాల్పడ్డారని ఆమె సోమ వారం పోలీసులకు సమాచారం ఇచ్చారు.

కోఆప్షన్‌ సభ్యురాలిగా హర్షత్‌జమ

జహీరాబాద్‌ టౌన్‌: మొగుడంపల్లి కోఆప్షన్‌ సభ్యురాలిగా హర్షత్‌జమ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కోఆప్షన్‌ సభ్యుడుగా ఉన్న తాజోద్దీన్‌ ఇటీవల మృతి చెందడతో సోమవారం ఎన్నిక నిర్వహించారు. మండల పరిషత్‌ కార్యాలయంలో జిల్లా పరిషత్‌ డిప్యూటీ సీఈఓ స్వప్న పర్యవేక్షణలో కోఆప్షన్‌ సభ్యుడి ఎన్నిక జరిగింది. మండలంలోని మాడ్గికి చెందిన హర్షత్‌జమ ఒక్కరే నామినేషన్‌ దాఖలు చేయడంతో ఆమె ఏకగ్రీవంగా ఎన్నికైంది.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

చేగుంట(తూప్రాన్‌): అనుమానస్పద స్థితిలో ఒకరు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని పోతాన్‌శెట్టిపల్లికి చెందిన దానొల్ల మహేష్‌(36) అదే గ్రామానికి చెందిన నవనీతను ప్రేమ వివాహం చేసుకున్నాడు. మహేష్‌ అనంతసాగర్‌ సబ్‌స్టేషన్‌లో ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవలకాలంలో మహేష్‌ తరచు మద్యం సేవిస్తూ భార్యతో గొడవపడేవాడు. ఆదివారంరాత్రి కూడా ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో నవనీత తన తల్లిగారింటికి వెళ్లింది. అదేరాత్రి మహేష్‌ కూడా అక్కడకే వెళ్లి పడుకున్నాడు. సోమవారం ఉదయం చూసేసరికి మహేష్‌ కిందపడిపోయి కనిపించాడు. వెంటనే తూప్రాన్‌ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మహేష్‌ మృతి చెందాడని వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి తండ్రి నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



మహేష్‌ మృతదేహం

గుంతలో మహిళ మృతదేహం

అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు

కొల్చారం(నర్సాపూర్‌): అనుమానాస్పద స్థితిలో ఓ మహిళ మృతదేహం గుంతలో లభ్యమైంది. కొల్చారం ఎస్‌ఐ శ్రీనివాస్‌గౌడ్‌ తెలిపిన వివరాల ప్రకారం.. కౌడిపల్లి మండలం ముంగ్రాయి గ్రామానికి చెందిన గొల్ల ప్రమీల (45) ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో చెప్పకుండా వెళ్లింది. సోమవారం కొల్చారం మండల పరిధిలోని రాంపూర్‌కు చెందిన రైతులు అటవీప్రాంత సమీపంలోని తమ పొలాలకు వద్దకు వెళ్లగా, అక్కడ గుంతలో ఓ మహిళ మృతదేహం తేలి ఉండడాన్ని గమనించారు. ఒంటిపై జాకెట్‌, లోదుస్తులు మాత్రమే ఉన్నాయి. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు సంఘటనస్థలానికి వచ్చి చూడగా, కొద్దిదూరంలో మృతురాలు ధరించిన చీర కనిపించింది. గుంతలో నుంచి ప్రమీల మృతదేహాన్ని బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం మెదక్‌ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా మృతురాలి భర్త లక్ష్మయ్య పదేళ్ల క్రితమే చనిపోయాడు. ఆమెకు పెళ్లయిన కూతురు, కుమారుడు ఉన్నాడు. బంధువుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేశారు. అంతకుముందు ఘటన స్థలానికి మెదక్‌ ఎస్పీ రోహిణి వచ్చారు. పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయాలని ఎస్‌ఐని ఆదేశించారు.



గుంతలో ప్రమీల మృతదేహం

కోదాడకని వెళ్లి.. కొండపోచమ్మసాగర్‌లో శవమై

- పచ్చబొట్టు ఆధారంగా వివరాల సేకరణ
- హత్య కేసుగా నమోదు

ములుగు(గజ్వేల్‌): కొండపోచమ్మసాగర్‌లో ఓ మృతదేహం తేలియాడుతూ కనిపించింది. స్థానికులు పోలీసులు సమాచారం ఇచ్చారు. సంఘటనస్థలానికి వచ్చిన వారు మృతుడి కుడి చేయికున్న పచ్చబొట్టు ఆధారంగా వివరాలు సేకరించారు. మృతుడు సంగారెడ్డి జిల్లా కంది మండలం ఇంద్రకరణ్‌ గ్రామానికి చెందిన చాకలి మధు(26)గా గుర్తించారు. గజ్వేల్‌ రూరల్‌ సీఐ రాజశేఖర్‌రెడ్డి, ములుగు ఎస్‌ఐ రంగకృష్ణలు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంద్రకరణ్‌ గ్రామానికి చెందిన మధు ఐదు రోజుల క్రితం కోదాడకు వెళుతున్నానని ఇంట్లో చెప్పి బయలుదేరాడు. ఏం జరిగిందో ఏమో తెలియదుగానీ సోమవారం కొండపోచమ్మసాగర్‌లో తేలియాడుతున్న మధు మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి కాళ్లు, మెడకు వైరు కట్టారు. ఆవైరుకు బండరాయి కట్టి ఉండడం చూస్తే..మధును ఎవరో చంపి నీటిలో పడేసినట్టుగా అనుమానం వస్తుందన్నారు. హత్యకేసుగా నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు. నిందితులను త్వరలోనే పట్టుకుంటామని చెప్పారు. కాగా సంఘటనస్థలాన్ని గజ్వేల్‌ ఏసీపీ రమేష్‌ కూడా పరిశీలించారు.



మధు (ఫైల్‌)

రామలింగేశ్వరస్వామి ఆలయంలో చోరీ

చిలప్‌చెడ్‌(నర్సాపూర్‌): మండల పరిధిలోని చండూరు శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో దొంగతనం జరిగింది. ఆలయ సేవకుడు నాగయ్య తెలిపిన వివరాల ప్రకారం..సోమవారం ఉదయం ఆలయాన్ని శుభ్రం చేస్తుండగా, ఆలయానికి ఉండే మరో ద్వారం తాళం కిందపడి ఉంది. అనుమానంతో గర్భగుడిలోకి వెళ్లి చూడగా, వెండి నాగపడిగలు, మకరతోరణం కనిపించలేదు. మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా రథోత్సవం నిర్వహించిన అనంతరం స్వామివారి వెండి వస్తువులు గుడిలోనే ఉంచారు. ఉత్సవాల తర్వాత గుడిని తెరవలేదు. సోమవారం భక్తుల తాకిడి ఉంటుందని, ఆలయం శుభ్రం చేయడానికి వస్తే స్వామి వారి వెండి వస్తువులు దొంగతనానికి గురయ్యాయన్నారు. విషయం పోలీసులకు చెప్పగా, ఏఎస్‌ఐ మిస్బావుద్దీన్‌ తన సిబ్బందితో వచ్చి ఆలయ పరిసరాలను పరిశీలించారు. క్లూస్‌ టీంను పిలిపించి వివరాలు సేకరించారు.



ఆలయంలో వివరాలు సేకరిస్తున్న పోలీసులు

కుక్కల దాడిలో గొర్రెలు మృతి

జిన్నారం(పటాన్‌చెరు): కొట్టంలో ఉన్న గొర్రెల గుంపుపై ఒక్కసారిగా వీధికుక్కలు దాడి చేశాయి. ఈ ఘటనలో 11 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. గుమ్మడిదల మండలం కానుకుంటకు చెందిన ఆగ మల్లయ్య వంద గొర్రెలు ఉన్నాయి. రోజూలాగే సాయంత్రం కాగానే వాటిని కొట్టంలోకి తోలాడు. సోమవారం తెల్లవారుజామున పది వీధికుక్కలు అందులోకి చొరబడి దాడి చేశాయి. 11 గొర్రెలు తీవ్రంగా గాయపడి మృతి చెందాయి. వాటి విలువ రూ.70 వేలు ఉంటుంది. ఈ విషయం తెలుసుకున్న పశుసంవర్ధకశాఖ అధికారి అరుణ ఘటనాస్థలానికి చేరుకున్నారు. ఉన్నతాధికారులకు నివేదించి రైతుకు న్యాయం జరిగేలా చూస్తానన్నారు. గుమ్మడిదల ఎంపీపీ ప్రవీణ, జెడ్పీటీసీ సభ్యుడు కుమార్‌గౌడ్‌, నాయకులు విజయభాస్కర్‌రెడ్డి, హుస్సేన్‌ తదితరులు రైతును పరామర్శించారు.



కుక్కల దాడిలో మృతి చెందిన గొర్రెలు

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

కంది(సంగారెడ్డి): ట్రాక్టర్‌, టీవీఎస్‌ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరు గాయపడ్డారు. రూరల్‌ ఎస్‌ఐ శ్రీనివాస్‌రెడ్డి కథనం ప్రకారం.. ఇస్నాపూర్‌కు చెందిన మేదరి కృష్ణ(37) తన బంధువైన సింగితం గ్రామానికి చెందిన మేదరి కిష్టయ్యతో కలిసి టీవీఎస్‌పై ఆదివారం రాత్రి బ్యాతోల్‌ మీదుగా ఇస్మాయిల్‌ఖాన్‌పేటకు వెళుతున్నాడు. ఈ క్రమంలో బ్యాతోల్‌ కమాన్‌ సమీపంలో ఎదురుగా ఇసుకలోడుతో వస్తున్న ఓ ట్రాక్టర్‌ టీవీఎస్‌ను ఢీకొట్టింది. దీంతో కృష్ణ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కిష్టయ్యకు గాయాలయ్యాయి. మృతుడి భార్య నాగమణి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



మేదరి కృష్ణ (ఫైల్‌)

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

ఝరాసంగం(జహీరాబాద్‌): చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్‌ఐ రాజేందర్‌ రెడ్డి చెప్పిన కథనం ప్రకారం...మండల పరిధిలోని చీలమామిడి గ్రామానికి చెందిన సంగన్న(38) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 24వ తేదీన పెద్దాపూర్‌లోని బంధువుల ఇంటికి బైక్‌పై బయలుదేరాడు. గ్రామశివారులో అడవిపంది అతివేగంగా వచ్చి బైక్‌కు తగిలింది. దీంతో సంగన్న కింద పడ్డాడు. తీవ్ర గాయాలు కావడంతో జహీరాబాద్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. మృతుడి భార్య నరసమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ చెప్పారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

అటవీ అధికారుల ఆకస్మిక తనిఖీ

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం పట్టణంలోని టింబర్‌ డిపో, సామిల్లులో జిల్లా అటవీ శాఖ అధికారి ఆదేశాల మేరకు సంగారెడ్డి అటవీ శాఖ రేంజర్‌ వీరేంద్రబాబు సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని సాయిరాం సామిల్లులో మిషన్లకు సంబంధించిన లైసెన్స్‌ రెన్యూవల్‌ చేసుకోకపోవడంతో వాటిని సీజ్‌ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టింబర్‌ డిపోలు, సామిల్‌ తప్పనిసరిగా లైసెన్సులు తీసుకోవాలన్నారు. నిబంధనలకు అనుగుణంగా కలప ఉండాలని, అంతకు మించి కలప ఉంటే చర్యలు తప్పవన్నారు. ఈ తనిఖీలో డిప్యూటీ రేంజ్‌ అధికారిణి షహీన్‌, వేణుగోపాల్‌, మంజిత్‌సింగ్‌, గంగాభవాని, సంతోషి, నిజాముద్దీన్‌, బేస్‌ క్యాంప్‌ సిబ్బంది పాల్గొన్నారు.

ఆశ్రమ ఏర్పాటు ఇక్కడి ప్రజల అదృష్టం

శ్రీ కృష్ణానందజీ మహరాజ్‌ను దర్శించుకున్న సునీతాలక్ష్మారెడ్డి

నర్సాపూర్‌ రూరల్‌: సిద్ధయోగి శ్రీ కృష్ణానందజీ మహరాజ్‌ను రాష్ట్ర మహిళాకమిషన్‌ చైర్‌పర్సన్‌ సునీతా లక్ష్మారెడ్డి దర్శించుకున్నారు. చిప్పల్‌తుర్తిలో సద్గురుధామ ఆశ్రమంలో మూడు రోజుల ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఆమె ఆశ్రమానికి వచ్చారు. ఈ సందర్భంగా సునీతా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ప్రజలు ఆధ్యాత్మిక చింతనతో ఆనందంగా గడపాలన్నారు. కబీర్‌సేన రాష్ట్ర అధ్యక్షుడు చత్రునాయక్‌ ఆధ్వర్యంలో ఆశ్రమం ఏర్పాటు చేయడం ఇక్కడి ప్రజల అదృష్టమన్నారు. ఈ కార్యక్రమంలో చిప్పల్‌తుర్తి, జక్కపల్లి గ్రామాల సర్పంచ్‌లు శ్యామల లక్ష్మణ్‌ గౌడ్‌, వెంకటలక్ష్మి, శ్రీనివాస్‌, బీఆర్‌ఎస్‌ మండల పార్టీ అధ్యక్షుడు శేఖర్‌, సత్యం గౌడ్‌ తదితరులు పాల్గొన్నారు,



శ్రీ కృష్ణానందజీ మహరాజ్‌ ఆశీర్వాదం తీసుకుంటున్న సునీతాలక్ష్మారెడ్డి

చెన్నకేశవరెడ్డిని గెలిపించాలి

కొండాపూర్‌(సంగారెడ్డి): హైదారాబాద్‌–రంగారెడ్డి–మహబూబ్‌నగర్‌ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పీఆర్‌టీయూ బలపరిచిన గుర్రం చెన్నకేశవరెడ్డిని గెలిపించాలని కోరుతూ సోమవారం ఆ యూనియన్‌ నేతలు సంగారెడ్డి, సదాశివపేట, మునిపల్లి మండలాల్లో పర్యటించారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సంగారెడ్డికి వచ్చిన పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్‌ రావు, నిజామాబాద్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్‌ గౌడ్‌లు వివిధ కళాశాలలు, ప్రభుత్వ పాఠశాలలు సందర్శించారు. చెన్న కేశవరెడ్డిని గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమలాకర్‌ రావు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ఎలాంటి సమస్యలు ఉన్న పరిష్కరించేది కేవలం పీఆర్‌టీయూనేనని, 30 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్‌సీని ప్రకటింప చేశామని, బదిలీలు, పదోన్నతుల షెడ్యూలు విడుదల కాకపోతే ఓట్లు అడగమని చెప్పిన దమ్మున్న సంఘం పీఆర్‌టీయూ మాత్రమేనని తెలిపారు. గుర్రం చెన్నకేశవరెడ్డిని మొదటి ప్రాధాన్యత ఓటుతో గెలిపించాలని కోరారు ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి మదన్‌గోపాల్‌, సంగారెడ్డి మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రామకష్టారెడ్డి శ్రీనివాస్‌, సంగారెడ్డి అర్బన్‌ అధ్యక్షుడు వెంకటకృష్ణ, సదాశివపేట అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రవణ్‌ కుమార్‌, ప్రవీణ్‌, సదాశివపేట అర్బన్‌ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విరాట్‌ స్వరూప్‌, తుకారాం జిల్లా, మండల, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



చెన్నకేశవరెడ్డిని గెలిపించాలని ప్రచారం నిర్వహిస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు